సాక్షి
తిరుపతి
మంగళవారం ၊ 21 ၊ జనవరి ၊ 2025



దిక్కెవరు దేవుడా?

రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఇద్దరు మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. - 8లో



రూ.వంద కోట్లతో పూడిక తీత

వంద కోట్లతో పూడి రాయదొరువు ముఖద్వార పూడిక తీత పనులు చేపట్టనున్నట్టు మంత్రి తెలిపారు. - 8లో



7,188 పింఛన్ల కోత!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే 7,188 పింఛన్లు కోత వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

తిరుపతి జిల్లా ఎస్పీగా విష్ణువర్ధన్‌రాజు




విష్ణువర్ధన్‌రాజు (ఎస్పీ) సుబ్బరాయుడు(రెడ్‌శాండిల్ ఎస్పీ)

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీగా విష్ణువర్ధన్ రాజును నియమిస్తూ ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విజయవాడ హెడ్ క్వార్టర్లో ఉన్న ఆయన్ను తిరుపతికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్బరాయుడును రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ ఎస్పీగా నియమించారు. ఇదిలావుండగా విష్ణువర్ధన్‌రాజుకు గతంలో తిరుపతిలో పనిచేసిన అనుభవం ఉంది. ఈయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం.

పోలీస్ గ్రీవెన్స్‌కు 53 ఫిర్యాదులు



ఎస్పీకి ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెలువెత్తినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు 53 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు, ఇతర ఫిర్యాదులు ఉన్నట్టు పేర్కొన్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

శ్రీవారిని దర్శించుకున్న 70,826 మంది భక్తులు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వార దర్శనం ద్వారా 70,826 మంది స్వామివారిని దర్శించుకోగా.. 22,625 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


అన్నప్రసాదంతోపాటు మసాలా వడ

తిరుమల. శ్రీవారి భక్తులకు అన్నప్రసాద వితరణతోపాటు మసాలా వడలు పెట్టాలని టీటీడీ యోచిస్తోంది. ఈ మేరకు సోమవారం ఐదువేల మంది భక్తులకు మసాలా వడలు వడ్డించి, ప్రయోగాత్మకంగా పరిశీలించింది. రేపటి నుంచి ఈ సంఖ్యను అంచెలంచెలుగా పెంచనున్నట్టు టీటీడీ పేర్కొంది. రథసప్తమి నుంచి పూర్తి స్థాయిలో మసాలా వడల కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

సర్వర్లు డౌన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎండోమెంట్‌కు సంబంధించిన సర్వర్ డౌన్ అయ్యింది. సోమవారం సాయంత్రం 4 నుంచి సుమారు రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆన్‌లైన్ టిక్కెట్ల అమ్మకాలపై ప్రభావం పడింది. రూ.500 టిక్కెట్లను మాన్యువల్‌గా ఇవ్వాల్సి వచ్చింది. దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా రాష్ట్ర స్థాయిలో సమస్య తలెత్తిందని తెలిపారు.

మిస్ గ్లోబల్ ఏషియా విన్నర్‌గా భావనరెడ్డి



తిరుపతి కల్చరల్: ఇటీవల మలేషియాలో నిర్వహించిన మిస్ గ్లోబల్ ఏషియా -2025 పోటీలలో విన్నర్‌గా చంద్రగిరికి చెందిన భావనరెడ్డి నిలిచారు. ఈమేరకు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మలేసియాలో చేపట్టిన మిస్ గ్లోబల్ ఏషియా-2025 పోటీలలో 30 దేశాలు వారు హాజరు కాగా తాను విన్నర్‌గా గెలుపొందినట్టు తెలిపారు. గతంలో 2023లో మిస్ ఇండియా ఐకానిక్ పోటీలలో విన్నర్‌గా నిలిచిన తనకు ప్రస్తుతం ఈ ఘనత సాధించడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు, నేషనల్ డైరెక్టర్ అర్పితాదేవ్ అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. మిత్ర ఫౌండేషన్ ద్వారా సమాజ శ్రేయస్సు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో భావనరెడ్డి తండ్రి గోపికృష్ణారెడ్డి, నేషనల్ డైరెక్టర్ అర్పితాదేవ్, పులికంటి మోహన్‌రెడ్డి, జీ.కోటేశ్వరరావు, కే.రాధేష్ పాల్గొన్నారు.

దోపిడీ వైద్యం!



- రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని ప్రైవేట్ ఆస్పత్రికి వారం క్రితం సత్యవేడు నుంచి ఓ రోగి వచ్చాడు. కడుపులో గడ్డ ఉందని, దాన్ని తొలగించాలంటే రూ.30 వేలు అవుతుందని ఆ ఆస్పత్రి యాజమాన్యం తేల్చింది. తీరా ఆపరేషన్ చేశాక రూ.70 వేలు బిల్లు వేశారు. దీనిపై ప్రశ్నించగా ఆపరేషన్ చేశాక ఎక్కువ తీవ్రతగా ఉందని, దానివల్ల ఎక్కువ ఖర్చయిందని మాయమాటలు చెప్పారు. అంత కట్టలేమని తేల్చి చెప్పడంతో రూ.55 వేలు వసూలు చేశారు.

- చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం నుంచి రెండు వారాల క్రితం స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి సిఫార్సుతో తుడా రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. ముందుగా చిన్నపాటి సర్జరీ అని చెప్పి రూ.20 వేలు ఖర్చవుతుందని రోగిని ఒప్పించారు. అతి కష్టం మీద ముందుగానే మొత్తాన్ని రోగి బంధువులు చెల్లించారు. ఆపరేషన్ చేశాక సాధారణంగానే ఐసీయూలో ఉంచారు. శ్వాస తీసుకునే పరిస్థితి లేదని, ఆరోగ్యం కుదుట పడలేదన్న సాకు చూపి ఏడు రోజులు పాటు ఐసీయూలోనే ఉంచారు. ఒక రోజుకు ఐసీయూ చార్జ్ రూ.15 వేలు, మెడిసిన్ రూ.5 వేలు చొప్పున ఏ రోజుకి ఆ రోజు రోగు నుంచి నిర్దాక్షిణ్యంగా వసూలు చేశారు. తనకున్న ఇల్లు, బంగారాన్ని తాకట్టు పెట్టి రోగి భర్త డబ్బులు చెల్లించాడు. డిశ్చార్జ్ సమయానికి మొత్తం బిల్లు రూ.లక్ష 76 వేలు చూపించారు. అయితే ముందుగానే రూ.1,60,000 ఎప్పటికప్పుడు వసూలు చేసేశారు. మిగిలిన రూ.16 వేలు కట్టి తీరాల్సిందేనని ఒత్తిడి తెచ్చారు. కొంతమంది జర్నలిస్టులు సిఫార్సు చేసినా ఆ ఆస్పత్రి యాజమాన్యం కనికరించలేదు. చివరకు రూ.6 వేలు చెల్లించి తన భార్యను ఇంటికి తీసుకెళ్లాడు.



ప్రాణం పోసేది దేవుడైతే.. ఆ ప్రాణాన్ని నిలబెట్టే వైద్యుడ్ని కూడా దేవుడిగానే జనం భావిస్తారు. వారికి సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. కానీ దీన్ని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల యజమానులు ధనపిశాచులుగా మారిపోతున్నారు. ఓపీలు మొదలు వివిధ పరీక్షలు, స్కానింగ్‌లు, మందులు, సూదుల పేరుతో పేద రోగులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. ఇక కుటుంబం కోసం ప్రాణాలు నిలబెట్టుకునేందుకు చాలా మంది ఇల్లువాకిలి, చివరకు భార్య మెడలోని పుస్తెలనూ తాకట్టు పెట్టి వైద్యం చేయిస్తున్నారు. దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం.. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతోనే ఇలా పిండుకు తింటున్నారని పలువురు రోగులు ఆవేదన చెందుతున్నారు.

- ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు
- టెస్టులు, మెడిసిన్ పేరుతో నిలువుదోపిడీ
- కమీషన్ల కోసం ఇష్టారాజ్యంగా స్కానింగ్‌లకు సిఫార్సు
- సేవా భావాన్ని విస్మరించిన వైద్యులు
- అప్పుల పాలవుతున్న పేద, బడుగు, బలహీన వర్గాలు
- ప్రైవేటుపై నియంత్రణలేని వైద్యఆరోగ్యశాఖ

తిరుపతి తుడా: జిల్లాలో ప్రయివేటు వైద్యుల దోపిడీ ఎక్కువైంది. రోగుల అర్హతలు, హోదాలను బట్టి టెస్టులు, స్కానింగ్‌లు రాస్తూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. ఇందులో గ్రామీణ మండల కేంద్రాల్లో ఆర్ఎంపీల డాక్టర్ల హవానే ఎక్కువగా ఉంటోంది. వారు వివిధ కార్పొరేట్ ఆస్పత్రులతో మాఫియాగా ఏర్పడి గ్రామీణ ప్రాంత రోగులను లేని రోగం పేరు చెప్పి పరుగులు పెట్టిస్తున్నారు. ఇదే అదునుగా బడా ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల నుంచి అందినకాడికి వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణ, వ్యాధి నిర్ధారణ, మందుల విషయంలో వైద్య ఆరోగ్యశాఖకు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ మాఫియా మరింతగా రెచ్చిపోతోంది. ఈ నేపథ్యంలో అడిగినంత ఇచ్చుకోవాల్సి పరిస్థితి ఏర్పడుతోంది.

నిలువు దోపిడీ

అనారోగ్య సమస్యతో ఆస్పత్రులకు వచ్చే రోగులను మెడికల్ మాఫియా నిలువు దోపిడీ చేస్తోంది. సమస్యను తీవ్రం చేసి చెప్పడంతో ప్రాణ భయంతో చేసేది లేక లక్షలాది రూపాయలను ముట్ట చెప్పాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. రోగి డాక్టర్ వద్దకు వెళ్లాలంటే వసూలు చేసే ఫీజును రూ.400 నుంచి రూ.800 వరకు పెంచేశారు. గతంలో ఒక రూపాయి డాక్టర్‌గా రూ.10 డాక్టర్లుగా చలామణి అయ్యేవాళ్లు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రోగి ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి మానవతా దృక్పథంతో ఆదుకునే వారు కరువయ్యారు. ఓపీ చూపించుకున్న తర్వాత వివిధ అనారోగ్య సమస్యలు ఉండొచ్చేమోనని రోగులను అనుమానంలోకి నెట్టి పలు రకాల రక్త పరీక్షలు, స్కానింగ్ లు, ఎక్స్‌రేలు, ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లకు సిఫార్సు చేస్తున్నారు. సాధారణ జ్వరం, కడుపునొప్పి అని వచ్చిన రోగులకు రూ.10 వేల వరకు వసూలు చేసి పంపి చేస్తున్నారు. వీటిపై సరైన నియంత్రణ లేకపోవడంతోనే విచ్చలవిడిగా రోగుల నుంచి వసూలు చేస్తున్నారు.



మెడికల్ సిండికేట్

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు స్థానికంగా అందుబాటులో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడి వద్దకి వెళతారు. ఆ తర్వాత అక్కడ ఆయన సిఫార్సు మేరకు తిరుపతి నగరంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు పరుగులు పెడతారు. అప్పో సప్పో చేసి ఇక్కడికి వచ్చిన రోగి నుంచి రక్తం తాగినట్లు డబ్బును వసూలు చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రికి సిఫార్సు చేసిన ఆర్ఎంపీ వైద్యుడికి మామూళ్లు ఉంటాయి.

స్కానింగ్‌కు పంపిస్తే 30 శాతం



తిరుపతి నగరంలో ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు వీటితో కుమ్మక్కై ఇష్టా రాజ్యంగా సిటీ స్కానింగ్, ఎమ్మార్ఐ లాంటి టెస్టులకు సిఫార్సు చేస్తున్నారు. తాము చెప్పిన స్కానింగ్ సెంటర్‌కి వెళ్లాలని రోగులకు ఆస్పత్రి యాజమాన్యం హుకుం జారీచేస్తోంది. అలా స్కానింగ్ సెంటర్‌కు వెళ్లిన రోగి నుంచి రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇందులో ఆ స్కానింగ్ సెంటర్‌కు సిఫార్సు చేసిన వైద్యుడికి 30 శాతం వాటా పంపుతున్నారు. ఈ వాటాలకు కక్కుర్తి పడి కొన్ని ఆస్పత్రులు ఇష్టా రాజ్యాంగ రక్త పరీక్షలు, స్కానింగ్‌లకు పంపిస్తున్నారు. అవసరమున్నా లేకున్నా రక్త పరీక్షలు, స్కానింగ్‌లకు రెకమెండ్ చేయడం వెనుక మాఫియా రింగ్ ఉందన్నది జగమెరిగిన సత్యం.

సేవా భావాన్ని విస్మరించి .. కాసులకు కక్కుర్తిపడి!



వైద్యం సేవా భవంతో కూడుకున్నది. అయితే ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం సేవా భావంతో వైద్యాన్ని అందించే వైద్యులు చాలా అరుదుగా కనిపిస్తుంటారు. రోగుల దోపిడీయే లక్ష్యంగా అత్యధిక ప్రైవేట్ ఆస్పత్రులు పనిచేస్తున్నాయి. ఏదో ఒక రూపంలో రోగి నుంచి ఎంతవరకు రాబట్టొచ్చు అన్నదే అజెండాగా పెట్టుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కి రూపాయి డాక్టర్‌గా పేరు ఉంది. అలానే 25 ఏళ్ల క్రితం తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, పాకాల దామలచెరువు వంటి ప్రాంతాల్లో ఇలాంటి ఫ్రీ సర్వీస్ వైద్యులు ఉండేవాళ్లు. ఇప్పుడు అలాంటి వాళ్ల కోసం వెదికినా కనిపించరు.

పీల్చేస్తున్నారు



“ ఇటీవల నాకు వైరల్ జ్వరం వచ్చింది. నా కుటుంబ సభ్యులు గూడూరులోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చూపించారు. రెండు రోజులు అతని వద్దనే ఉంచారు. సెలైన్లు పెట్టి జ్వరం తగ్గించారు. ఇంటికి వచ్చాక మరుసటి రోజు మరలా జ్వరం వచ్చింది. తర్వాత ఆ ఆర్ఎంపీ పలు రకాల పరీక్షలకు రాసి ఇచ్చాడు. దానికే తడిసిమోపుడైంది. మందులు, మాత్రలు రాసిచ్చారు. మళ్లీ ఐదు రోజుల తర్వాత జ్వరం తిరగబెట్టింది. మరోసారి వైద్యుని వద్దకు వెళ్లగా నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికెళ్తే వారం రోజులు పెట్టుకుని రూ.50 వేలు గుంజుకున్నారు.

– వసంతమ్మ, గొల్లపాళెం, వాకాడు మండలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ప్రైవేట్ ఆస్పత్రులు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. వాటిని అతిక్రమిస్తే శాఖాభారమైన తీవ్ర చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రిలో సిటిజన్ చార్ట్ తప్పనిసరి ఉండాలి. వైద్యుడి ఓపీ ఫీజు, ఐసీయూ ఫీజు, ల్యాబ్ లలో ప్రతి పరీక్షకు సంబంధించిన ధరల పట్టిక డిస్ప్లే చేయాలి.. ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌కు సంబంధించిన ధరల వివరాలను కచ్చితంగా రోగులకు కనిపించేలా పెట్టాలి. ఎన్టీఆర్ వైద్య సేవలు పొందే రోగుల నుంచి వైద్య పరీక్షలు, ఎంఆర్ఐ, సిటీ వంటి వాటికి ఎలాంటి ఫీజు వసూలు చేయరాదు. వైద్యాన్ని సేవా దృక్పథంతో అందించాలి.

– డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

‘అమ్మకు వందనం’ బాబు పంగనామం

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్పడం చంద్రబాబు నైజమనడానికి ఈ సంవత్సరం ‘అమ్మకు వందనం’ ఇవ్వకుండా పంగనామం పెట్టడమేనని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో రూ.15 వేలే ఇచ్చిందని, తాము అధికారంలోకి రాగానే ప్రతి ఏటా అమ్మకు వందనం పేరుతో రూ.20 వేలు ఇస్తామని గొప్పలు చెబుతూ హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే గత నాలుగు రోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో వచ్చే ఏడాది నుంచి అమ్మకు వందనం ఇచ్చేలా నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ఆపకుండా పేద ప్రజలకు సకాలంలో అందించిన గొప్ప నాయకుడు జగనన్న మాత్రమేన అని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ‘నాడు నేడు ’ పథకం ద్వారా సుమారు రూ.60వేల కోట్లతో ప్రయివేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు, పుస్తకాలు, దుస్తులు, షూ ఇస్తూనే మాతృభాషకు ఎక్కడా విఘాతం కల్గించకుండా మాతృభాషతో పాటు ఆంగ్ల విద్యను కూడా ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. అయితే గత ఏడు నెలల్లో ఒక్క పేదవాడికి కూడా సంక్షేమ పథకాలు అందించలేదు కానీ రాష్ట్రమంతా మద్యం మాత్రం ఏరులై పారిస్తున్నాడని చంద్రబాబుపై మండిపడ్డారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం



పెద్ద పాండూరు ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

వరదయ్యపాళెం: అకాల వర్షం రైతన్నల ఆశలపై నీళ్ల చల్లింది. వరదయ్యపాళెం మండలంలో పలుచోట్ల పంట చేతికొచ్చే సమయంలో రెండు రోజుల పాటు కురిసిన వాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీంతో కొన్నిచోట్ల కోతలు కోసి రాసులు పోసిన వరి ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. మరికొన్నిచోట్ల వరికోతకు సిద్ధంగా ఉన్న పంట నేలకొరిగింది. ఎప్పుడూ లేని విధంగా ఈ సీజన్‌లో వర్షాలు పడడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగిందని పలువురు వాపోతున్నారు. మండలంలో ప్రధానంగా పెద్ద పాండూరు, రాచర్ల, మత్తేరిమిట్ట, సీఎల్ఎన్‌పల్లి, ముస్లింపాళెం, కదూరు, కాంబాకం, వెంగారెడ్డికండ్రిగ, చిన్న పాండూరు ప్రాంతాల్లో వరి పంట నష్టపోయినట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

శివా..ఎవరికి వరమిస్తావో?

ముక్కంటి చెంత.. మూడు ముక్కలాట

- శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు కోసం ముక్కోణపు పోటీ
- అనుచరుడికి చైర్మన్ పదవిని ఖరారు చేయించిన బొజ్జల
- అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యేలు సత్రవాడ, ఎస్సీవీ, జనసేన
- త్రిముఖ పోటీతో చైర్మన్ పేరు ప్రకటించని వైనం



సాక్షి ప్రతినిధి, తిరుపతి: శ్రీకాళహస్తి దేవస్థాన పాలకమండలి అధ్యక్ష పదవి కోసం టీటీడీ, జనసేన నేతలు నాకా నీకా అంటూ పోటీపడుతున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తన అనుచరుడి పేరు ఖరారు చేయించినా.. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, జనసేన నాయకురాలు కోట వినుత అడ్డుకున్నారు. ఫలితంగా బొజ్జల అనుచరుడి పేరుని ప్రకటించకుండా ఆపినట్లు విశ్వసనీయ సమాచారం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీటీడీ పాలకమండలి తరువాత శ్రీకాళహస్తి పాలక మండలి అంతటి ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా తన ముఖ్య అనుచరుడు చెంచయ్యనాయుడికి ఇప్పించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భావించారు. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ద్వారా ట్రస్ట్‌బోర్డు చైర్మెన్‌గా చెంచయ్యనాయుడు పేరును ఖరారు చేయించినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటన వెలువడనుందని తెలిసి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు నేరుగా సీఎం చంద్రబాబుని కలిసి తన ప్రతిపాదనను ఆయన ముందుంచినట్లు తెలిసింది. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారిలో తనతో పాటు మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య ఒకరని వివరించినట్లు సమాచారం. మునిరామయ్య కుమారుడైన సత్రవాడ ప్రవీణ్‌కి ఇప్పిస్తే.. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకింగ్ ఉన్న పల్లెరెడ్ల నుంచి పార్టీ పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుందని వివరించినట్లు తెలిసింది. శ్రీకాళహస్తి బోర్డు చైర్మన్‌గా ఇప్పటి వరకు పల్లెరెడ్లకు ఇవ్వలేదని, ఈ సారి ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రవీణ్‌కి ఇస్తే భవిష్యత్‌లో పల్లెరెడ్ల ఓట్లు టీడీపీకి అనుకూలంగా మారే అవకాశం ఉందని చంద్రబాబు దృష్టి తీసుకెళ్లినట్టు సమాచారం.

జనసేనకు ఎందుకు ఇవ్వరు?

కూటమిలో భాగస్వామ్యమైన జనసేనకు శ్రీకాళహస్తి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి ఇవ్వాలని ఆ పార్టీ నాయకురాలు కోట వినుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అదేవిధంగా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుని ఆమె కలిసి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. టీడీపీ నుంచి ఎమ్మెల్యే పదవి ఉందని, జనసేనకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి కట్టబెట్టడం న్యాయమైనదని సీఎంకు వివరించినట్లు ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి ఎమ్మెల్యే బొజ్జల అనుచరుడికి ఇస్తే.. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, జనసేన వర్గం నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు.. సుధీర్‌రెడ్డి సూచించిన పేరున ప్రకటించకుండా ఆపినట్లు శ్రీకాళహస్తిలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే సూచించిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇవ్వకపోతే.. నియోజకవర్గంలో బొజ్జల సుధీర్‌రెడ్డికి విలువ లేకుండా పోతుందని ఆయన వర్గీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ త్రిముఖ పోరులో శ్రీకాళహస్తీశ్వరుడు ఎవరికి వరమిస్తాడో అని నియోజకవర్గ జనం ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడి మృతి

చంద్రగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలోని శ్రీవారిమెట్టు మార్గంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతుడు గుండు చేసుకుని ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94942 28854, 94404 16642 నంబర్లను సంప్రదించాలని సూచించారు. చిత్తూరు ఆర్‌పీ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతి నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసుల్లో 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎన్.వి సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీ మణికంఠ చందోలు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు తిరుపతి నగరంలో మద్యం తాగి, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ అవసరం



విజయ సోపాన యాత్రను ప్రారంభిస్తున్న వీసీ, ఆర్పీఎఫ్ సీఐ

తిరుపతి సిటీ : విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్స్ ఎంతో ఉపకరిస్తాయని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఆమె సోమవారం మహిళా వర్సిటీలో ఏర్పాటుచేసిన విజయ సోపాన యాత్రను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్య, ఉపాధి రంగాల్లో మెళకువలు, ఉపాధి నైపుణ్యం, వ్యక్తిగత కౌన్సెలింగ్, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల సమాచారం అందించడంలో విజయ సోపాన యాత్ర ఉపయోగపడుతుందన్నారు. ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ మాట్లాడుతూ విద్యకు ఉపాధికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా విజయసోపాన యాత్ర ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పైడి అంకయ్య, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిక్కెవరు దేవుడా?

- కుక్కలదొడ్డి సమీపంలో ఘోర ప్రమాదం
- దైవ దర్శనానికి వచ్చివెళ్తూ దూసుకొచ్చిన మృత్యువు
- భార్యాభర్తలిద్దరూ మృతి
- అనాథలైన పిల్లలు
- మృతులు తెలంగాణలోని పటాన్ చెరువు వాసులు



నుజ్జునుజ్జు అయిన కారు



మృతిచెందిన దంపతులు



ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

రేణిగుంట: 'నీపై భక్తితో ఇంతదూరమొచామ. నిన్ను దర్శించి పునీతులయ్యాము. నీకు మొక్కులు చెల్లించి రుణం తీర్చుకున్నాము. ఇంతలోనే మాకు అంత నరకం చూపావు.. మా తల్లిదండ్రులను తీసుకెళ్లి దిక్కులేని వాళ్లను చేశావు..! అయ్యో..దేవుడా.. ఎలా బతికేది స్వామీ..! అంటూ ఆ పసిమనసులు తల్లడిల్లడం తీరు చూపరులకు కన్నీళ్లు తెప్పించింది. ఈ విషాద ఘటన రేణిగుంట–కడప మార్గంలోని రేణిగుంట మండలం, మామండూరు పంచాయతీ కుక్కలదొడ్డి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ట్రావెల్స్ బస్సు, కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

దైవభక్తి ఎక్కువ

తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరువు, అంబేడ్కర్ కాలనీకి చెందిన సందీప్‌షా(36)కు భార్య అంజలీదేవి(31), పిల్లలు లితికా షా(12), సోనాలీ షా(9), రుద్రప్రతాప్(6) ఉన్నారు. పటాన్‌చెరువులో ట్రేడింగ్ చేస్తూ సందీప్‌షా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎంతో అన్యోన్యంగా పిల్లలను చదివిస్తూ వారి భవిష్యత్ కోసం శ్రమిస్తున్నారు. సందీప్‌షాకు చిన్నతనం నుంచి దైవభక్తి ఎక్కువ. కుటుంబ సమేతంగా ప్రఖ్యాత ఆలయాలకు తరచూ వెళ్లి దర్శించుకునే వాడు. ఈ క్రమంలోనే సంక్రాంతి పండుగ ముగియగానే, ఈనెల 16వ తేదీన తన భార్య, పిల్లలు, అతని స్నేహితుడు నరేష్‌తో కలసి మొత్తం ఆరుగురు కారులో తిరుమలకు బయల్దేరారు. 17వ తేదీన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత ఆదివారం తిరుచానూరు పద్మావతి అమ్మవారు, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. సోమవారం కారులో సొంతూరుకు తిరుగుపయనమయ్యారు. రేణిగుంట మండలం, కుక్కలదొడ్డి సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును కారు అదుపు తప్పి ఢీకొంది. దీంతో కారు, బస్సు ముళ్లపొదల్లోకి దూసుకెళ్లాయి. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న సందీప్‌షా, అతని పక్కన కూర్చున్న భార్య అంజలీదేవి సీట్ల మధ్యలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చున్న లితికా షా, సోనాలిషా, రుద్రప్రసాప్, నరేష్‌కు రక్తగాయాలయ్యాయి. పెద్ద పాప లితికా షా తలకు బలమైన రక్త గాయమైంది. వెంటనే వారిని రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తరలించారు. లితికాషా పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయినా..

వారు ప్రయాణిస్తున్న కారుకు ప్రమాద సమయంలో రక్షణ కవచంగా నిలిచే ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయ్యాయి. అయినప్పటికీ కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో ప్రమాద తీవ్రత దృష్ట్యా వారు మృత్యుఒడికి చేరారు.

డీఎస్పీ పరిశీలన

రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో ఇరుక్కున్న సందీప్‌షా, అంజలీదేవి మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న మృతుల బంధువులు ఆ పిల్లలకు ఇక దిక్కెవరంటూ రోదించడం అక్కడివారిని కలిచివేసింది.

టూరిస్ట్ బస్సులోనూ భక్తులతో దైవయాత్ర

ఈ ప్రమాదంలో కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు జమ్మూ నుంచి 50 మంది భక్తబృందంతో దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ తిరుమలకు వచ్చే క్రమంలో ప్రమాదానికి గురైంది. 28 రోజుల కిందట వీరు జమ్ములో బయల్దేరారు. మరో 25 రోజులు వీరి యాత్ర సాగనుంది. అయితే అనూహ్య ప్రమాదంలో బస్సులోని యాత్రికులంతా తీవ్రంగా కలత చెంది రోడ్డు పక్కన దిగాలుగా కూర్చుండిపోయారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

తిరుపతి అర్బన్: జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆ మేరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మూడు సెంటర్లలో 1,242 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో పరీక్షలు ఆన్‌లైన్‌లో ఉంటాయని స్పష్టం చేశారు. అయితే 22, 23, 24, 28, 29 తేదీల్లో మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. 30వ తేదీ మాత్రం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఉంటుందని ఆయన వివరించారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే పరీక్షా కేంద్రాల వద్ద ఉండాలని, మధ్యాహ్నం 2.45 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. పరీక్ష రోజుల్లో రైల్వే, బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. అయాన్ డిజిటల్ జూపార్క్, చెర్లోపల్లి సెంటర్‌లో 928 మంది, అయాన్ డిజిటల్ జూపార్క్ కేఎంఎం రామిరెడ్డి గారి పల్లి చంద్రగిరి సెంటర్‌లో 229 మంది, ఎన్‌బికేఆర్ సైన్స్ అడ్ ఆర్ట్ కాలేజ్, విద్యానగర్ కోట మండలంలోని సెంటర్‌లో 85 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు.

రూ.వంద కోట్లతో పూడికతీత

- పూడి రాయదొరువు ముఖద్వారం పూడిక తీతపై మంత్రి వ్యాఖ్య



ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరోయిన్స్ కృతిశెట్టి, సంయుక్తమీనన్



భారీగా తరలివచ్చిన జనం

సూళ్లూరుపేట : పులికాట్ సరస్సును సంరక్షించుకుని తద్వారా విదేశీ వలస విహంగాలను మన చుట్టాలుగా భావించి కాపాడుకునేందుకు, అలాగే మత్స్యకారులకు జీవనోపాధిని కల్పించేందుకు వంద కోట్ల రూపాయలతో పూడి రాయదొరువు ముఖద్వారాన్ని పూడికి తీయించేందుకు సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారని జిల్లా ఇన్‌చార్జి మంతి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల కేంద్రాలుగా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్–2025 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముందుగా మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేసుకుంటే ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ టూరిజం ప్రధాన ఆదాయ వనరుగా చేయాలనే సంకల్పం ముఖ్యమంత్రి ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొండయ్య, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్, శ్రీసిటీ అధినేత రవీంద్ర సన్నారెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పరసా వెంకటరత్నయ్య, నెలవల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తీరు మారని రుయా



రోగుల కోసం ఉపయోగించే స్ట్రెచర్, వీల్ చైర్లపై ఇలా..

రుయాలో నిత్యం రోగులకు తిప్పలు తప్పడం లేదు. వైద్యాధికారులతోపాటు సిబ్బంది నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారు. రోగుల పట్ల వారికి ఉన్న ఉదాసీనతపై సహాయకులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రోగులను వైద్యం కోసం ఒక వార్డు నుంచి మరో వార్డుకు తరలించేందుకు స్ట్రెచర్ లేదా వీల్ చైర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. సోమవారం సిబ్బంది ఆక్సిజన్ సిలిండర్‌ను పట్టుకుని రోగులను రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకువెళుతుండడం కనిపించింది. వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారిని సైతం నడిపించుకుంటూ వెళ్లారు. స్ట్రెచర్, వీల్ చైర్లను మందులు, ఖాళీ డబ్బాలు, గోని సంచులు, ఆస్పత్రి ఫైళ్లను తీసుకువెళ్లేందుకు ఉపయోగిస్తున్నారు. దీనిపై రోగుల సహాయకులు, స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు.

– మోహన్‌కృష్ణ కేతారి, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



వద్ధురాలిని నడిపించి తీసుకు వెళ్తున్న సహాయకుడు

ఏడు నెలల్లో 7,188 పింఛన్ల కోత!

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వానికి కనికరం లేకుండా పోతోంది. పండుటాకులు, అభాగ్యులే లక్ష్యంగా జులుం ప్రదర్శిస్తోంది. జిల్లాలో 27 రకాలకు సంబంధించి 2,64,636 మందికి ప్రతి నెలా రూ.112.25 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే ఇందులో 7,188 మంది ఫించన్లు తగ్గించింది. అంతటితో ఆగకుండా దశల వారీగా పింఛన్లు తనిఖీలు చేయాలని నిర్ణయించింది. ముందుగా రెండు నెలల క్రితం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రేణిగుంట మండలంలోని సూరప్పకశంలో పింఛన్లు తనిఖీలు చేశారు. ఆ ఒక్క గ్రామంలోనే 17 మందిని అనర్హులుగా గుర్తించారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 1 నుంచి ప్రతి నెలా రూ.15 వేల పింఛన్లు తీసుకుంటున్న 1,199 మంది ఇంటికే వైద్య బృందం వెళ్లి తనిఖీలు చేస్తున్నారు. వారంతా మంచానికే పరిమితం కావడంతో వారి వద్దకే ముగ్గురు వైద్యులతో కూడిన బృందం వెళ్లి పరిశీలిస్తోంది. ఈ నెల 31కి తనిఖీలు పూర్తి చేసి...తర్వాత ఎంత మంది అనర్హులో ప్రకటించనున్నారు.

రూ.6 వేల పింఛన్ల తనిఖీ ప్రారంభం



రూయాలో వినికిడి, దృష్టి, మానసిక లోపం పింఛన్‌దారులను తనిఖీ చేస్తున్న వైద్యులు

జిల్లాలో ప్రతి నెలా రూ.6 వేలు పింఛన్ తీసుకుంటున్న వినికిడి లోపం, దృష్టి లోపం, మానసిక లోపం కల్గిన వారి లబ్ధిదారులను ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వాస్పత్రులకు లబ్ధిదారులను పిలిపించి వైద్యులు తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ప్రతి నెలా రూ.5 వేలు తీసుకుంటున్న వారికి ఫిబ్రవరి 1 నుంచి, ప్రతి నెలా రూ.10 వేలు తీసుకుంటున్న వారిని మార్చి 1 నుంచి, ప్రతి నెలా రూ.4 వేలు తీసుకుంటున్న పింఛన్‌దారులను ఏప్రిల్ 1 నుంచి తనిఖీ చేయనున్నారు.

మానసిక దృఢ సంకల్పంతో రోగం దూరం

తిరుపతి అర్బన్: మానసిక దృఢ సంకల్పంతో రోగం దూరమవుతుందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలలో సోమవారం యునిసెఫ్‌కు చెందిన దేశ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ హుబ్బే అలీతో కలసి ఫాగ్సి సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తందూల్వాడ్కర్ ఆరోగ్య యోగ యాత్ర ప్రచారంపై సదస్సును చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ దీర్ఘకాలంగా తాను వైద్యవృత్తిలో కొనసాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. తాను గుర్తించింది ఏ రోగి అయినా మానసికంగా ఎంతో పటిష్టంగా ఉంటే రోగాలు దరిచేరవని చెప్పారు. ఫాగ్సి సంస్థతోపాటు మునిసెఫ్ భాగస్వామ్యంతో... దేశంలో 13 ఆధ్యాత్మిక నగరాల్లోనూ దీనిపై ప్రచారం చేయడం హర్షణీయమన్నారు. ఫాగ్సి సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తందూల్వాడ్కర్ మాట్లాడుతూ 34ఏళ్లుగా వైద్యురాలిగా పనిచేస్తున్నానని...ఈ క్రమంలో తాము గుర్తించిన అంశం వైద్యానికి ఆధ్యాత్మికత చేర్చడం ద్వారా చక్కటి ఫలితాలు అందుతాయని వివరించారు. అనంతరం యునిసెఫ్‌కు చెందిన దేశ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ హుబ్బే అలీ మాట్లాడుతూ 'గర్భిణీ స్త్రీల మానసిక ఆరోగ్యం అత్యంత క్లిష్టమైనదిగా పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి(పక్కన) ఫాగ్స్ అధినేత, యూనిసెఫ్ ప్రతినిధి

23న విద్యార్థుల సదస్సు




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌ఓ ఆషా, విద్యార్థులు

తిరుపతి సిటీ: రాయలసీమ కరువు, వలసలు, విద్యా, ఉపాధి రంగ సమస్యలు, కర్తవ్యాలు అనే అంశంపై ఆదోనిలో ఈనెల 23న జరగనున్న విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా పీడీఎస్‌ఓ కార్యదర్శి ఆర్.ఆషా పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎస్వీయూ లైబ్రరీ ఎదుట సోమవారం ఆమె విద్యార్థినాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా విజయభరత్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా విజయభరత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆ మేరకు ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం విధుల్లో చేరారు. అనంతరం మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. కృష్ణా జిల్లా జోనల్ మేనేజర్‌గా పనిచేస్తూ తిరుపతి జిల్లాకు విచ్చేశారు. తిరుపతి జిల్లా జోనల్ మేనేజర్ చంద్రశేఖర్‌ను ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు.



కలెక్టర్‌తో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్‌రెడ్డి

పెట్రోల్‌తో దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

నాగలాపురం: పెట్రోల్‌తో దాడి చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మండలంలోని అడవికొడియంబేడు దళితవాడ సమీపంలో వెట్టి మనోహర్ (68)పై శుక్రవారం ఉదయం అదే గ్రామానికి చెందిన చిన్నతంబి అనే వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు స్పందించారు. పరారీలో ఉన్న చిన్నతంబిని తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి ఎస్‌ఎస్‌బి.పేట చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశారు.



ముద్దాయిని అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ వెంకటేష్

28 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ జిల్లాలోని దేవుని కడపలోనున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఈమేరకు సోమవారం టీటీడీ పరిపాలనా భవనంలోని ఈఓ చాంబర్‌లో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు స్వామివారి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య అంకురార్పణ, 29న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 3న స్వామివారి కల్యాణోత్సవం చేపడతారు. రూ.300 చెల్లించి గృహస్తులు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. అలాగే ఫిబ్రవరి 7న పుష్పయాగం జరగనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీ.వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డెప్యూటీ ఈఓలు నటేష్‌బాబు, ప్రశాంతి పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ, జేఈఓ

అర్జీలపై అశ్రద్ధ వద్దు

తిరుపతి అర్బన్: గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలపై అశ్రద్ధ చూపొద్దని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 185 అర్జీలు వచ్చాయి. ఇందులో 122 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను తీసుకోవడం కాకుండా పరిష్కారం చేయడం నేర్చుకోవాలని చెప్పారు. పరిష్కారం కాని సమస్యలకు ఏ విధంగా పరిష్కారం లభిస్తుంది.. అందుకు అవసరమైన డాక్యుమెంట్స్ వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. డీఆర్వో నరసింహులుతో పాటు డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, రోజ్‌మాండ్ హాజరయ్యారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

ఏనుగుల కట్టడికి చర్యలు


తిరుపతి మంగళం : ఏనుగుల దాడిలో మరో ప్రాణం పోకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వివేక్ తెలిపారు. సోమవారం కపిలతీర్థం వద్ద జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కందులవారిపల్లి దుర్ఘటన దురదృష్టకరమన్నారు. అడవులకు ఏనుగులే రారాజు అని, వాటితో చాలా జాగ్రతగా ఉండాలన్నారు. ఏనుగుల గుంపు వచ్చినప్పుడు టపాకాయలు కాలవడం, పెద్దగా హారన్లు కొట్టడం, డప్పులు కొట్టడం వంటివి చేయరాదన్నారు. ఏనుగుల గుంపును జనావాసాల నుంచి అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు నూతనంగా ఎలిఫెంట్ రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల గుంపు అడవిలో కదిలే గమనాలను గుర్తిస్తామన్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో అనుసరిస్తున్న విధానాలను లఘు చిత్రాన్ని చిత్రీకరించి ప్రదర్శించనున్నట్టు తెలిపారు. గత తొమ్మిది నెలలుగా ఏనుగుల గుంపు కందులవారిపల్లె సమీప అటవీ ప్రాంతంలో తిరుగుతున్నాయన్నారు.



జిల్లా అటవీశాఖ అధికారి వివేక్

స్నానఘట్టాలు..మురికి కూపాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ స్నానఘట్టాలు మురికి కూపాలుగా మారాయి. ప్రతి ఏటా త్రిశూల స్నానం నిర్వహించే నీటి తొట్టిలో మురుగు నీరు నిండి దుర్గంధభరితంగా మారింది. పొరపాటును ఎవరైనా స్వర్ణముఖి నది వద్దకు వెళ్లాలని కిందకు వస్తే ముక్కు పట్టుకోవాల్సిందే. ఆలయం తరపున సుమారు 80 మంది, కాంట్రాక్టర్ పరిధిలో 175 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. మొత్తంగా 250 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని పర్యవేక్షించేవారు అదనంగా ఉన్నారు. కానీ ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచలేకపోతున్నారు. జలవినాయకుని వద్ద అనేక సంవత్సరాలుగా చిన్న వర్షం పడినా నీరు నిలబడి అలాగే ఉండిపోతోంది. ఆలయ అధికారులు అనేకసార్లు కాలువలు, పైపులైన్లతో ఫలితం లేకుండా పోయింది. ఆలయానికి శివయ్యగోపురం నుంచి వెళ్లే భక్తులు, జలవినాయక ఆలయం వద్దకు వచ్చే వారు. ఆ నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. దీనిపై సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



త్రిశూల స్నాన ఘట్టంలో వ్యర్థాలు